క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్‌: మండల కేంద్రంలోని శివ గార్డెన్స్‌లో శనివారం ఉదయం 11.30 గంటలకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అబ్దుల్లాపూర్‌మెట్‌ తహసీల్దార్‌ రవీందర్‌ దత్తు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ ఉంటుందని అన్నారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం: రాయపోల్‌ ఫీడర్‌ పరిధిలో విద్యుత్‌ తీగల మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్‌ పంపిణీని నిలిపివేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం విద్యుత్‌ ఏఈ శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముకునూర్‌, దండుమైలారం, నెర్రపల్లి గ్రామాలతోపాటు చుట్టుపక్కల ఉన్న పౌల్ట్రీఫామ్స్‌, వ్యవసాయ బోరు బావులకు ఉదయం 10గంటల నుంచి ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ పంపిణీ ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత: ఎంపీడీఓ

కడ్తాల్‌: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ సుజాత అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో శుక్రవారం పారిశుద్ధ్యంపై నిర్వహించిన స్పెషల్‌ డ్రైవ్‌లో ఆమె పాల్గొన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో కాలనీల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లడంతో పాటు కలుపు మొక్కల నివారణ మందులు చల్లారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, తడి–పొడి చెత్త నిర్వాహణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మధుసూదనాచారి, కార్యదర్శి రాఘవేందర్‌ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

'అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం'


దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం 12వ వార్డులో గురువారం కురిసిన వర్షానికి ధ్వంసమైన కట్రోత్‌ భారతిరమేష్‌నాయక్‌ ఇంటిని కాంగ్రెస్‌ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈదురుగాలులకు ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయి ఇంట్లోని ఆహార వస్తువులు, దుస్తులు, సామగ్రి దెబ్బతిని తీవ్రంగా నష్టపోయినట్లు బాధితులు తెలిపారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని.. అధైర్యపడొద్దని కాంగ్రెస్‌ నేతలు వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చందు, జగదీశ్‌ యాదవ్‌, ఆనంద్‌, శ్రీనివాస్‌, మరళీకృష్ణ, అదిత్య తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు సహకరించండి

పహాడీషరీఫ్‌: జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా బస్తీలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని 22వ వార్డు బీఆర్‌ఎస్‌ ఇన్‌చార్జి సయ్యద్‌ హుస్సేన్‌ కోరారు. ఈ మేరకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని శుక్రవారం కలిసి సమస్యను విన్నవించారు. హెచ్‌ఎండీఏ నిధులతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఇదివరకే శంకుస్థాపన జరిగినప్పటికీ అధికారులు పనులు ప్రారంభించడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. 21వ వార్డులో కూడా కౌన్సిలర్‌ షేక్‌ ఫమిదా అఫ్జల్‌ సమస్య పరిష్కారం కోసం పలుమార్లు విన్నవించారని గుర్తుచేశారు. దీంతో పాటు బక్రీద్‌ పండుగ సందర్భంగా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా అధికారులను అప్రమత్తం చేయాలని విజ్ఞప్తి చేశారు.

టీఎన్జీఓ సెంట్రల్‌ యూనియన్‌ ఉపాధ్యక్షుడిగా పర్వతాలు

బడంగ్‌పేట్‌: తుక్కుగూడ మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పర్వతాలు టీఎన్జీఓ సెంట్రల్‌ యూనియన్‌ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారని రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. 2023 నుంచి 2026 వరకు పదవిలో కొనసాగుతారన్నారు. ఇటీవలనిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా బరిలో ఉండి రెండోసారి విజయం సాధించడం విశేషం. పర్వతాలు మాట్లాడుతూ.. యూనియన్‌ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నాన్‌గజిటెడ్‌ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని చెప్పారు. నాన్‌గెజిటెడ్‌ ఉద్యోగుల కుటుంబాలకు యూనియన్‌ తరుపున అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ నియామకానికి సహకారం అందించిన రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్‌కు, మద్దతు తెలిపిన సెంట్రల్‌ యూనియన్‌ కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా సమస్యలు పట్టవా?

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో డ్రైనేజీ లీకేజీలతో మురుగు పరుగు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు


కవాడిపల్లి వద్ద కుంటలా మారిన మురుగు

అబ్దుల్లాపూర్‌మెట్‌: పంచాయతీల్లో పాలకవర్గం ఉన్నప్పుడు ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకువెళ్తే కొన్నిరోజుల తర్వాతైనా పరిష్కారం అయ్యేదనే నమ్మకం ఉండగా.. ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల వైపు ప్రత్యేకాధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు మరింత అభివృద్ధి చెందడంతో పాటు తక్షణమే సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్న ప్రజల ఆశలు అడియాశలుగానే మిగిలిపోతున్నాయి. సమస్యలు చెప్పుకుందామంటే అధికారులు అందుబాటులో ఉండరు.. ఒకవేళ ఉన్నా పరిష్కారానికి చర్యలు చేపట్టరు. అబ్దుల్లాపూర్‌మెట్‌ మండల కేంద్రంలోని కవాడిపల్లి వద్ద విజయవాడ జాతీయ రహదారికి అనుకుని ఉన్న బీసీ కాలనీకి వెళ్లే దారిలో.. పారిశుద్ధ్య నిర్వహణ లోపం వల్ల కొన్నిరోజులుగా మురుగు పొంగిపొర్లుతూ.. రహదారిపై వచ్చి చేరడంతో అక్కడ కుంటలా మారింది. దీంతో ఆ రహదారి వెంట వెళ్లే ప్రయాణికులతో పాటు స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామానికి ప్రత్యేకాధికారిణిగా ఎంపీడీఓ ఉన్నప్పటికీ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. పులమార్లు విన్నవించినా సమస్య పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. పరిస్థితి ఇలానే ఉంటే ఆందోళన చేపడతామన్నారు. వెంటనే డ్రైనేజీ లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

"సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

కవాడిపల్లి వద్ద మురుగు సమస్య ఉన్న విషయం మా దృష్టికి వచ్చింది. గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసప్రసాద్‌, పంచాయతీ కార్యదర్శి

మైనింగ్‌ పనులను అడ్డుకోండి

ఆర్డీఓకు చీపునుంతల గ్రామస్తుల వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తలకొండపల్లి: మైనింగ్‌ పేరిట అనుమతికి మించి చేపడుతున్న తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని చీపునుంతల గ్రామస్తులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు కందుకూరు ఆర్డీఓ సూరజ్‌ కుమార్‌కు శుక్రవారం వారు వినతిపపత్రం అందజేశారు. మైనింగ్‌ పనుల వలన వ్యవసాయ బోరుబావులు కుంగి పరిసర ప్రాంతానికి చెందిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. చీపునుంతల గ్రామంలో సర్వే నంబర్‌ 22లో 42ఎకరాల భూమి ఉంది. అందులో 32 ఎకరాల్లో మైనింగ్‌ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అనుమతి గడువు పూర్తయిన తర్వాత కూడా, మైనింగ్‌కు సంబంధించిన వ్యక్తులు మైనింగ్‌ తవ్వకాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో బోరు బావులు కుంగి రైతులు తీవ్రంగా నష్టపోవడమే గాకుండా సకాలంలో నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పరమేష్‌, నిర్మలమ్మ, బాయమ్మ, వీరప్ప, యాదమ్మ, ఆశన్న, ఎల్లమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- రామదూత ఆశ్రమ వ్యవస్థాపకుడు శివానందస్వామి


సందేశం వినిపిస్తున్న శివానందస్వామి

ఆమనగల్లు: దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీ రామదూత ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ శివానందస్వామి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ నిత్యశుద్దానంద స్వామి క్షేత్రంలోని శ్రీ రామదూత ఆశ్రమంలో శుక్రవారం నిత్యాశుద్దానందస్వామి 3వ పుణ్య ఆరాధన కార్యక్రమం, 60వ విష్ణు సహస్రనామ మహాయజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉదయం జ్యోతి ప్రజ్వలన, శ్రీ మద్భగవద్గీతా పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ యజ్ఞం నిర్వహించారు. అనంతరం శ్రీ శివానందస్వామి, గూడూరు లక్ష్మణ నందగిరి స్వామి, యాదగిరిగుట్ట శ్రీ శంకరానందగిరి స్వామి, గంగాపురం ఆశ్రమ అధిపతి మల్లికార్జునానంద స్వామి సందేశాలు అందించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్‌ రామ్మోహన్‌, ఆశ్రమ స్థలదాతలు లక్ష్మయ్య, శ్రీనివాసులు, యాదయ్య, లక్ష్మయ్య భక్తులు పాల్గొన్నారు.

పాల బిల్లులు విడుదల చేయండి

ఎంపీ మల్లురవి, విజయ డెయిరీ జీఎంకు పాడిరైతుల వినతి

కడ్తాల్‌: విజయ డెయిరీ నుంచి పాడిరైతులకు రావాల్సిన పెండింగ్‌ పాలబిల్లులు వెంటనే చెల్లించాలని పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు శుక్రవారం కడ్తాల్‌ పాలశీతలీకరణ కేంద్రంలోని పాల ఉత్పత్తిదారులు, పాడిరైతు సంఘం నాయకులు ఎంపీ మల్లురవి, విజయ డెయిరీ జనరల్‌ మెనేజర్‌ మల్లయ్యను కలిసి వినతి ప్రతం అందజేశారు. వారు మాట్లాడుతూ.. విజయ డెయిరీ పాడిరైతుల నుంచి సేకరించిన పాలకు గత ఎప్రిల్‌ 16 నుంచి పాలబిల్లులు అందించకపోవడంతో పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. పాడి పశువులను పోషించడం కష్టంగా మారిందని అన్నారు. వెంటనే పాలబిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా లీటర్‌ పాలకు రూ.4 ప్రోత్సాహకం ప్రతిరోజు నమోదు చేయడానికి బదులు.. నెలకు ఒకసారి గతంలో మాదిరిగానే నమోదు చేసే విధంగా చూడాల వినతి పత్రంలో కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాడి రైతులకు హామీ ఇచ్చారు. పాల ఉత్పత్తిదారుల, సహకార సంఘాల నాయకులు వెంకటేశ్‌, బీచ్యానాయక్‌, రవీందర్‌రెడ్డి, రంగయ్య, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

మల్లురవికి సత్కారం..

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్‌ ఎంపీ డా.మల్లురవిని శుక్రవారం ఆమనగల్లు వైస్‌ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లో ఎంపీ మల్లురవిని.. అనంతరెడ్డి కలిసి ఆమనగల్లు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎన్నికల్లో విజయం సాధించడం పట్ల ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్‌ వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్‌ జంగయ్య తదితరులు ఉన్నారు.

యాచారం

తహసీల్దార్‌ బదిలీ

యాచారం: మండల తహసీల్దార్‌ అయ్యప్ప బదిలీ అయ్యారు. ఆయన్ను మూసీ రివర్‌ డెవలప్‌మెంట్‌ ప్రాజెక్టుకు డిప్యూటేషన్‌పై పంపిస్తూ శుక్రవారం జిల్లా కలెక్టర్‌ శశాంక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి తెలిపారు. యాచారం మండలానికి త్వరలో కొత్త తహసీల్దార్‌ను పంపియనున్నట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచాల: మండల పరిధిలోని రంగాపూర్‌ మినీ ఎస్టీ గురుకుల బాలికల పాఠశాలలో మొదటి తరగతిలో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపాల్‌ నీలావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 24వ తేదీన లాటరీ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థుల వివరాలను ఈనెల 27న పాఠశాల నోటీసు బోర్డులో ఉంచుతామని పేర్కొన్నారు.

మట్టి టిప్పర్లతో పరేషాన్‌


సాగర్‌ రోడ్డుపై వెళ్తున్న మట్టి టిప్పర్‌

యాచారం: నాగార్జున సాగర్‌–హైదరాబాద్‌ రహదారిపై మట్టి టిప్పర్లు ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. నల్లగొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లోని చెరువుల నుంచి ఇటుక బట్టీల కోసం వ్యాపారులు టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నారు. పగలు, రాత్రి లేదా లేకుండా టిప్పర్లు సాగర్‌ హైవేపై నడుస్తున్నాయి. ఇవి అతి వేగంగా వెళ్తుండటంతో సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. అతి వేగంగా వెళ్తున్న మట్టి టిప్పర్లపై పోలీసులు నిఘా పెట్టి డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పీఏసీఎస్‌లకు నిధులు కేటాయించండి


వినతిపత్రం అందజేస్తున్న పీఏసీఎస్‌ నాయకులు

కడ్తాల్‌: రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్‌ చైర్మన్‌ మహ్మద్‌ ఒబేదుల్లా కొత్వాల్‌ను ఆమనగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌ గంప వెంకటేశ్‌ గుప్తా శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. స్టేట్‌ మైనార్టీ కార్పొరేషన్‌ నుంచి.. మైనార్టీల బలోపేతానికి డీసీసీబీ బ్యాంకుల ద్వారాగాని, సొసైటీల ద్వారాగాని నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లాల సహకార సంఘం నాయకులువిష్ణువర్ధన్‌రెడ్డి, రంగారెడ్డి ఉన్నారు.

నీట్‌ పరీక్షను రద్దు చేయాలి


ఆమనగల్లు: నిరసన తెలుపుతున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

ఎన్‌ఎస్‌యూఐ నేతల నిరసన

ఆమనగల్లు: నీట్‌ పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఎండీ ఫరీద్‌ డిమాండ్‌ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్‌ కార్యాలయం ఆవరణలో అంబేద్కర్‌ విగ్రహం వద్ద ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఈమేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందించారు. నీట్‌ పరీక్ష ఫలితాల్లో అవకతవకల జరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మహేశ్‌, అబ్దుల్‌, రాహుల్‌, కాంగ్రెస్‌నాయకులు కృష్ణనాయక్‌, అలీం, ప్రసాద్‌, మైసయ్య, నాజర్‌, మహేశ్‌, కరీం, గౌస్‌ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: నీట్‌ పరీక్షను రద్దు చేసి మరలా నిర్వహించాలని ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు రమేష్‌నాయక్‌ డిమాండ్‌ చేశారు. ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ కిసాన్‌సెల్‌ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్‌, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో

కడ్తాల్‌: నీట్‌ పరీక్షల్లో అనేక అవకతవకలు జరిగాయని వెంటనే ఆ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు శాబుద్దీన్‌ డిమాండ్‌ చేశారు. ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్‌ జిల్లా నాయకులు రాజేశ్‌, యూత్‌ కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్‌,నాయకులు.. పవన్‌కల్యాణ్‌, బోసురవి, ఇమ్రాన్‌బాబా, దర్శన్‌, మహేందర్‌, చరణ్‌, విజయ్‌, సందీప్‌, మనోహర్‌ తదితరులు ఉన్నారు.


ఇబ్రహీంపట్నం: నిరసన తెలుపుతున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: నీట్‌ ఫలితాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో అనేక మంది విద్యార్థులు ఆందోళనకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వెంటనే ఆ పరీక్షను రద్దు చేయాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు నంద కిషోర్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ప్రధాని మోడీ, ప్రభుత్వ, ఎన్‌టీఏ సంస్థ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆయాన్‌, అనాస్‌, ప్రభాస్‌, అజయ్‌, సాయి, అమిత్‌, వంశీ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి


మహేశ్వరం: ప్రభుత్వ మోడల్‌ స్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

సీఐలు వెంకటేశ్వర్లు, కాశీవిశ్వనాథ్‌

మహేశ్వరం: యువత డ్రగ్స్‌, గంజాయి బారినపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం మహేశ్వరం పోలీస్‌ స్టేషన్‌ ఆధ్వర్యంలో ప్రభుత్వ మోడల్‌ స్కూల్‌లో డ్రగ్స్‌, గంజాయి వాడకం వలన కలిగే నష్టాలు, సైబర్‌ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్‌, గంజాయికి అలవాటు పడితే శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. స్కూల్‌ ప్రిన్సిపాల్‌ ధనుంజయ్‌, ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, రవీందర్‌ పలువురు పాల్గొన్నారు.

డ్రగ్స్‌, గంజాయి బారిన పడొద్దు

మీర్‌పేట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌ కాశీవిశ్వనాథ్‌ సూచించారు. బాలాపూర్‌ చౌరస్తాలోని వాగ్దేవి జూనియర్‌ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్‌వలన కలిగే అనర్థాలపై పోలీసులు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ..మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయండి

మంత్రి కోమటిరెడ్డికి కాంగ్రెస్‌ నేతల వినతి

బడంగ్‌పేట్‌: గుర్రంగూడ–అల్మాస్‌గూడ రోడ్డును బాగు చేయించాలని కోరుతూ కాంగ్రెస్‌ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌ గౌడ్‌ శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి విన్నవించారు. బడంగ్‌పేట మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని గుర్రంగూడ టూ అల్మాస్‌గూడ ప్రధాన రహదారి గుంతలమయం అయిందన్నారు. గతంలో నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించలేదని అన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి మూడురోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు.


మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్‌గౌడ్‌

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింహగౌడ్‌, సురేష్‌, పీర్‌సాహెబ్‌, సంజయ్‌, శ్రీధర్‌, గడ్డం ఎన్‌క్లేవ్‌ కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


తలకొండపల్లి: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేసిన ఉపాధ్యాయులు


ఇబ్రహీంపట్నం రూరల్‌: యూనిఫాం అందజేస్తున్న ఎంపీపీ కృపేశ్‌

- ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు
- ముమ్మరంగా బడిబాట

మంచాల: పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్య అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంచాలలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్‌ అధికారి రాందాస్‌, ప్రత్యేకాధికారి తేజ్‌సింగ్‌, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్‌, ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, సుగంధ, ఝాన్సీ, మాజీ సర్పంచ్‌ జగన్‌రెడ్డి, గ్రామ కోఆప్షన్‌ సభ్యుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇర్విన్‌ గ్రామంలో..

మాడ్గుల: మండలంలోని ఇర్విన్‌ గ్రామంలో ప్రధానోపాధ్యాయులు పర్వతాలు ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్‌..

తలకొండపల్లి: మండల పరిధిలోని చౌదర్‌పల్లి ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూపతి నాయక్‌, బలరామ్‌, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌ పద్మ, మహిళా సంఘం అధ్యక్షురాలు బాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్‌ నిర్మల, శేఖర్‌, మల్లయ్య, ప్రేమలత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం ఎంచుకోవాలి..

యాచారం: విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యం ఎంచుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా యాచారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆమె పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనిఫాంల పంపిణీ..

ఇబ్రహీంపట్నం రూరల్‌: ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఎంపీపీ కృపేశ్‌ పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం స్కూల్‌ డ్రస్సులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, ప్రత్యేకాధికారి ఇంద్రాసేనారెడ్డి, నాయకులు రమేష్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.